ఆగని చోరీలు.. రైతులకు తిప్పలు

- సోలార్ ఫెన్సింగ్ బ్యాటరీలతో పాటు విద్యుత్ మోటార్ల స్టార్టర్ల అపహరణ
- తిరిగి బిగించుకోవాలంటే అల్లాడుతున్న రైతులు

మండల పరిధిలోని గ్రామ సమీపాల్లో నిమ్మతోటలు, ఇతర పంటలకు ఏర్పాటు చేసుకునే ఫెన్సింగ్ బ్యాటరీలను కొందరు చోరీ చేసి అమ్ముకుంటున్నారు. దీంతో పాటు పలుచోట్ల విద్యుత్ మోటార్ల స్టార్టర్లు అపహరించుకుపోతుండడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.


తోటలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్


సోలార్ ఫెన్సింగ్ బ్యాటరీ

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో నిమ్మతోటలు, ఇతర పంటల సాగుపై పశువులు, అడవి పందులు పడి ధ్వంసం చేయకుండా రైతులు సోలార్ ఫెన్సింగ్ నిర్మాణం చేసుకుంటారు. వీటికి అన్నిరకాల అనుమతులు ఉంటాయి. అధికారులే సోలార్ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టి పంటలను రక్షించుకోవాల్సిందిగా వెల్లడిస్తుంటారు. ఇలాంటి ఫెన్సింగ్ వల్ల పశువులు, మనుషులకు ఎలాంటి ప్రాణహానీ ఉండదు. కేవలం పంటలను రక్షించుకునేందుకు దాదాపుగా నిమ్మతోటలు ఉన్న ప్రతి రైతు ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇటీవల సోలార్ ఫెన్సింగ్‌కు సంబంధించిన ప్యానెల్, బ్యాటరీలను దొంగలు తస్కరిస్తున్నారు. చిల్లర దొంగతనాలకు అలవాటు పడిన వారు గ్రామ సమీపాల్లో నిమ్మతోటలు, ఇతర పంటలకు ఏర్పాటు చేసుకునే ఫెన్సింగ్ బ్యాటరీలను చోరీ చేసి అమ్ముకుంటున్నారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఫెన్సింగ్‌కు రూ.15 వేలు ఖర్చు

సుమారు ఐదెకరాల తోటకు సోలార్ ఫెన్సింగ్ నిర్మించుకునేందుకు రైతులకు రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. సోలార్ ప్యానెల్, బ్యాటరీ, ఫెన్సింగ్ తీగలను కొనుగోలు చేసి బిగించుకుంటారు. అయితే దొంగలు, వ్యసనాలకు అలవాటు పడిన వారు బ్యాటరీ, ప్యానెల్‌ను తస్కరించి రూ.2 వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోలార్‌తో పాటు విద్యుత్ మోటార్ల స్టార్టర్లను సైతం దొంగిలించుకుపోతున్నారు. ఇటీవల మొగళ్లూరు, అంకుపల్లి, డేగపూడి తదితర గ్రామాల్లో తోటల్లో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ బ్యాటరీలు చోరీకు గురయ్యాయి. దీంతో రైతులు అల్లాడిపోతూ నగదు ఖర్చుతో పాటు తిరిగి ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా మారుతున్నట్టు వాపోతున్నారు.

ఆగని విద్యుత్ మోటార్ల చోరీ

ఎప్పటి నుంచో మండల పరిధిలో విద్యుత్ మోటార్లు, వాటి స్టార్టర్లు చోరీలకు గురవుతూనే ఉన్నాయి. చిల్లర నేరగాళ్లు ఇలాంటి పనులు చేస్తున్నట్టు తెలుస్తోంది. మోటారు వైరును కూడా వదలకుండా కత్తిరించుకుని వెళ్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఇలాంటి నేరాలకు సంబంధించి పోలీసులు కొందరిని అరెస్ట్ చేసినా తరచుగా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల మొగళ్లూరు తోట షెడ్డులో పాత మోటార్లు ఉండగా రెండింటిని తస్కరించిన చోరులు పొదలకూరులో అమ్ముకున్నట్టు తెలిసింది. బాధితులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. చిల్లర నేరగాళ్లను అరికట్టకుంటే తోటల్లో మోటార్లు, ఫెన్సింగ్‌కు రక్షణ లేకుండాపోతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూటమి అరాచకాల అడ్డుకట్టకే డిజిటల్ బుక్


నార్తురాజుపాళెంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు


విడవలూరు మండల కేంద్రంలో..

- ఏపీఎల్డీఏ ఛైర్మన్ విజయకుమార్, ఆఫ్కాఫ్ మాజీ ఛైర్మన్ అనిల్‌బాబు వెల్లడి

కొడవలూరు: కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ అరాచకాలను అడ్డుకొనేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని ఏపీఎల్డీఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఆఫ్కాఫ్ మాజీ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబులు స్పష్టం చేశారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, అక్రమ అరెస్ట్‌లు చేస్తున్నారని చెప్పారు. రెడ్‌బుక్ అరాచకాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకే డిజిటల్ బుక్‌ను ప్రవేశ పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరిగిన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్యాయం జరిగిన వారికి న్యాయం చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి సామాన్య కార్యకర్త కాలర్ ఎగురవేసి తిరిగేలా చేస్తామని అధినేత భరోసా ఇచ్చారని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు మాట్లాడుతూ అన్యాయం జరిగిన ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.శ్రీలత, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, ఎంపీటీసీ ఎస్.ప్రసాద్, డీఎల్డీఏ డైరెక్టర్ ఎం.మల్లికార్జున, నాయకులు పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, నెలవాయి మాణిక్యరావు, కొట్టే మల్లికార్జున, కాకి సుమన్, బండి పెంచలయ్య, జడ్డా సాయికుమార్, సీహెచ్.కార్తీక్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, టి.ప్రసన్నకుమార్, మహేంద్ర పాల్గొన్నారు.

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

విడవలూరు: వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బంది పెట్టే ప్రతిఒక్కరూ జగనన్న 2.0 ప్రభుత్వంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనీల్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి గృహంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ తిరిగి వారినే వివిధ కేసుల్లో ఇరికించి జైలుకు పంపుతున్నారన్నారు. ఇలా అన్యాయాలకు గురవుతున్న ప్రతి కార్యకర్త డిజిటల్ బుక్‌లో తమ బాధలను పొందుపరచవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్‌లు యాటగిరి ప్రవీణ్‌కుమార్, శీనయ్య, నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, నెల్లూరు చెంచురత్నం, బుచ్చింగారి తిరుపతయ్య, కొండూరు శ్రీనివాసులు, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివుని నరసింహ, గాలి జ్యోతి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అండర్‌పాస్‌లో నానా అవస్థలు


అండర్‌పాస్‌లో ద్విచక్ర వాహనదారుల అగచాట్లు

కొడవలూరు: మండలంలోని టపాతోపు రైల్వే అండర్‌పాస్‌లో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత ఆదివారం రాత్రి మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీనికే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలిచాయి. అవి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మోకాలి లోతు వరకు నీరు అలాగే ఉండిపోయాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఈ నీళ్లలో రాలేక అవస్థలు పడుతున్నారు. ఈ అండర్‌పాస్‌లో ద్విచక్ర వాహనాలు కొంతదూరం వచ్చాక నిలిచిపోతున్నాయి. దీంతో బురదనీటిలోనే వాహనాన్ని నెట్టుకొంటూ బయటకు రావల్సి వస్తోంది. పైగా ఇక్కడ ఎలాంటి విద్యుద్దీపాలు లేకపోవడంతో బ్రిడ్జి కింద పట్టపగలే చీకటి అలుముకొంటోంది. దీంతో వాహనదారులకు నీటిలోతు తెలియక తికమకపడుతున్నారు. ఇక్కడ చిన్నపాటి వర్షం కురిసినా 20 రోజుల వరకు ఇదే పరిస్థితి నెలకొంటోంది. గతంలో కురిసిన వర్షాలకు ఇదే పరిస్థితి నెలకొనగా ప్రత్యేక మోటార్లతో వర్షపు నీటిని బయటకు పంపారు. ఇప్పుడూ అదేలా చేస్తే తప్ప వాహనదారులకు అగచాట్లు తప్పవు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమంటూ అండర్‌పాస్‌కు పైకప్పు వేశారు. అది కూడా పూర్తిస్థాయిలో వేయకపోవడం వల్ల సమస్య యథావిధిగా ఉండిపోయింది. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పైకప్పు నిర్మించడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతి


మదన్‌కుమార్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): గుండె పోటో?, మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ ఓ వ్యక్తి నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్‌లో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన మదన్‌కుమార్ (40) కేరళలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. వారణాసికి వెళుతున్నానని అక్కడి నుంచి బయలుదేరిన అతను నెల్లూరుకు వచ్చాడు. గతనెల 14వ తేదీ నుంచి బృందావనంలోని ఓ లాడ్జీలో ఉంటూ మద్యం తాగుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం మదన్ ఊరు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. తిరుపతి నాన్‌స్టాప్ కేంద్రం సమీపంలోని దిమ్మెపై కూర్చొని అక్కడ కుప్పకూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన అక్కడున్న వారు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కళ్లు, నుదిటిపై నల్లటి మచ్చలున్నాయి. ఆర్టీసీ డిపో కంట్రోలర్ రమణయ్య చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇటీవల యాక్సిడెంట్ జరిగిందని, అందువల్లే కళ్లు, నుదిటిపై నల్లమచ్చలు ఏర్పడ్డాయని లాడ్జీ వద్దగల కొందరు పోలీసులకు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జగన్మాతా.. నమోస్తుతే

పొదలకూరు : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం లలితా సహస్రనామార్చన, చండీ హోమం, పుష్పహోమం నిర్వహించారు. ఉభయకర్తలుగా తన్నీరు వీరప్రకాశం, విజయకుమార్ వ్యవహరించారు.

మరుపూరులో..

మండలంలోని మరుపూరులో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా పాశం వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఏర్పాట్లను దేవస్థానం కమిటీ అధ్యక్షుడు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

మహాలక్ష్మిగా అమ్మవారు

పట్టణంలోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వకార్యాల్లో విజయం కోసం సకల ద్రవ్యాలతో అభిషేకించారు.

ఇనుకుర్తిలో..

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న కాంతమ్మతల్లి ఆశ్రమయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మనుబోలులో..

మనుబోలు: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా భాగవతుల సురేష్- పద్మ దంపతులు వ్యవహరించారు.

➡ మనుబోలు, కోదండరామపురం దసరా చావిళ్లలో మంగళవారం రాత్రి నిర్వహించిన మహిషాసురమర్దిని ఉత్సవం ఆకట్టుకుంది. పార్వతీదేవి, మహిషాసురుడి వేషధారణలతో గ్రామంలో నృత్య ప్రదర్శన చేశారు.


పొదలకూరు : మరుపూరులో..

➡ **తోటపల్లిగూడూరు:** మండలంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. కోడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం జరిగిన పూజా కార్యక్రమాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మారంరెడ్డి బుజ్జిరెడ్డి–అపర్ణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వేళ్లపాళెం శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి బాబారెడ్డి, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, పుల్లూరు శేషు, ఊటుకూరు శ్రీనివాసులు, కైలాసం రాజా, ఊటుకూరు అవినాష్, చింతా సీతారామయ్య, ఊటుకూరు దేవా, పామంజి దుర్గా, కంజి శ్రీరాములు, షేక్.అబూబాకర్, చింతా సుమన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

గంగపట్నంలో..

ఇందుకూరుపేట: శరన్నవరాత్రుల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పల్లకిసేవ వేడుకగా జరిగింది. ఉభయదాతలుగా నరసాపురానికి చెందిన తాతా సీతారావమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కాగా విజయదశమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పొదలకూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బిరదవోలు పంచాయతీ బ్రాహ్మణపల్లిలో ఉన్న అంకమ్మతల్లి ఆలయంలో బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్–శ్రీదేవమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్, రావుల విజయభాస్కర్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, మహా నవావరణపూజ నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో పట్టాభిషేకం వైభవంగా జరిగింది.

రావి ఆకుపై దుర్గమ్మ


పొదలకూరు: విజయదశమి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై దుర్గమ్మ చిత్రాన్ని ఆవిష్కరించారు. ప్రతిఒక్కరినీ అమ్మవారు రక్షించాలని ఆయన ఆకాంక్షించారు.

బొటన వేలిగోరుపై దుర్గాదేవి


మనుబోలు: యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము విజయదశమిని పురస్కరించుకుని దుర్గాదేవి సూక్ష్మ రూపాన్ని కొయ్యతో తయారు చేశారు. బొటన వేలిగోరుపై నిలిపేలా దీనిని రూపొందించారు.


మనుబోలు: పోలేరమ్మ ఆలయంలో..


కోడూరులోని మహాలక్ష్మి ఆలయంలో..


ఇందుకూరుపేట: చాముండేశ్వరీదేవి ఆలయంలో..


పొదలకూరు: అంకమ్మతల్లి ఆలయంలో..

బెల్టు షాపులకు భారీగా మద్యం


- గాంధీ జయంతి రోజున జోరుగా విక్రయించేందుకు సన్నాహాలు

విడవలూరు: విజయ దశమి, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో బెల్ట్‌షాపు నిర్వాహకులు భారీగా మద్యం బాటిళ్లను వైన్‌షాపుల నుంచి తరలిస్తున్నారు. గురువారం గాంధీ జయంతి రోజున బెల్టు షాపుల్లో జోరుగా అనధికార మద్యం విక్రయించేందుకు సన్నాహాలు చేసుకున్నారు. దీనికి మద్యం దుకాణాల సిబ్బందే సహకరిస్తూ బెల్ట్ నిర్వాహకులను షాపుల్లోకి తీసుకెళ్లి వారు కోరిన మద్యం బాటిళ్లను బ్యాగులు, గోనె సంచుల్లో నింపి పంపుతున్నారు. దీంతో బుధవారం మద్యం విక్రయాలు భారీస్థాయిలో పెరిగాయి. దీనిపై ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కాగా బ్రాండెడ్ మద్యం వైన్‌షాపుల్లో కంటే బెల్టు దుకాణాల్లోనే అధికంగా లభిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలు మొదలుకొని గృహాలు, రోడ్ల పైనే నిత్యం మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కనీసం గాంధీ జయంతి రోజైనా మద్యం విక్రయాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు పలు గ్రామాల్లో కాకాణి పర్యటన

పొదలకూరు: మండలంలో పలు గ్రామాలకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం విచ్చేస్తారని పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు మొగళ్లూరు, మధ్యాహ్నం నావూరుపల్లి, తాటిపర్తి గ్రామాలకు విచ్చేస్తారన్నారు.

నిబద్ధతతో పనిచేయండి


నియామకపత్రాలు అందుకున్న వారితో కలెక్టర్

నెల్లూరు రూరల్: డీఎస్సీ 2025లో ఉద్యోగాలు సాధించిన వారు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రభుత్వం అందించిన కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని కొలువులు సాధించిన అభ్యర్థులను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. నియామకపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సుమారు 300 మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ ఇవ్వగా 20 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ, స్టడీ సర్కిల్ కో ఆర్డినేటర్ వంశీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరమ్మకు ప్రసన్న నివాళులు


నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, నేతలు

ఇందుకూరుపేట: మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి మాతృమూర్తి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి అమ్మమ్మ జక్కా కామేశ్వరమ్మ మృతిచెందారు. ఈ క్రమంలో జగదేవిపేటకు మాజీ మంత్రి, ఆ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం విచ్చేసి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఎ.అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ బుధవారం పింఛన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు పింఛన్ల పెంపు, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

జీఎస్టీ 2.0తో రైతులకు ఉపశమనం

- జీఎస్టీఓ విజయలక్ష్మి

కొడవలూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో రైతులకు ఉపశమనం లభించిందని కావలి జీఎస్టీఓ విజయలక్ష్మి తెలిపారు. కొడవలూరులో జీఎస్టీ 2.0పై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల జీవితాలను మెరుగు పరచడంలో ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ యంత్రాలపై పన్ను రేటు గణనీయంగా తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.విజయలక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏ నిహారిక, మండల పరిషత్ సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్, స్థానిక నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కె.మల్లికార్జున, కె.వెంకటరమణారెడ్డి, కె.అమరేంద్రరెడ్డి, జి.రాజేంద్ర పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** తగ్గిన జీఎస్టీ టారీఫ్‌లపై వ్యవసాయశాఖ, జీఎస్టీ అధికారులు సంయుక్తంగా మండలంలోని బిరదవోలు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో రైతులతో మాట్లాడారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ల కొనుగోలుపై 18 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించినట్టు వెల్లడించారు. అనంతరం ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శివనాయక్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్(జీఎస్టీ) కె.ప్రమీల, సోషల్ వేల్ఫేర్ డీడీ శోభారాణి, ఏఓ ప్రతాప్, సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, వెన్నపూస రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరులో అవగాహన ర్యాలీ


పొదలకూరు: బిరదవోలులో..

➡ **మనుబోలు:** జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగానికి ఊరట కలిగిందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణ అన్నారు. ఈ క్రమంలో మనుబోలులో బుధవారం రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో 99.9 వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి పాల్గొన్నారు.